నమస్తే తెలంగాణ
కామారెడ్డి
10 | నిజామాబాద్, బుధవారం 2 ఏప్రిల్ 2025 | KAMAREDDY




- పొరుగు రాష్ట్రాల నుంచి అల్ప్రాజోలం రవాణా
- రోజుకో మార్గంలో జిల్లాకు తరలింపు
- కాంపౌండ్‌లోనే కల్తీ చేస్తున్న అక్రమార్కులు
- పట్టించుకోని ఎక్సైజ్ అధికారులు
- కల్తీకల్లుతో అనారోగ్యం బారిన పడుతున్న సామాన్యులు

ఉమ్మడి జిల్లాలో యథేచ్ఛగా తయారీ

# జోరుగా కల్తీ కల్లు దందా!

**ఉమ్మడి జిల్లాలో** కల్తీ కల్లు ఏరులైపారుతున్నది. కొందరు ముఠాగా ఏర్పడి కల్తీ కల్లును తయారుచేస్తూ పేదల జీవితాలతో ఆడుకుంటున్నారు. నిషేధిత ఉత్ప్రేరకాల నుంచి తయారుచేసిన కల్లును విక్రయిస్తూ అందినకాడికి దోచుకుంటున్నారు. కల్తీ కల్లు తాగిన వారు అనారోగ్యం పాలై దవాఖానల చుట్టూ తిరుగుతున్నారు. మానసిక రుగ్మతల బారినపడగా.. వారి కుటుంబాలు వీధిన పడుతున్నాయి. ఇటీవల రాష్ట్ర ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు కల్తీ కల్లును అరికట్టాలని ఆదేశించినా.. ఫలితం లేకుండా పోయింది. కాంపౌండ్లలో కల్తీ కల్లు విక్రయాలు జోరుగా సాగుతున్నాయి. కల్లు డిపోల్లోనే ఇదంతా బహిరంగంగా జరుగుతున్నా ఆబ్కారీ శాఖ తమకేమీ పట్టనట్లుగా వ్యవహరిస్తున్నది. కల్తీకల్లుపై ఫిర్యాదులు వచ్చినా అధికారులు చెత్తబుట్టలో వేస్తున్నారు. ఎక్సైజ్ మంత్రి జూపల్లి కృష్ణారావు ఇన్‌చార్జి మంత్రిగా ఉన్న నిజామాబాద్, కామారెడ్డి జిల్లాల్లో అడ్డూఅదుపులేకుండా కల్తీకల్లు దందా కొనసాగడం గమనార్హం.

–నిజామాబాద్, ఏప్రిల్ 1
(నమస్తే తెలంగాణ ప్రతినిధి)

**ఉమ్మడి జిల్లాలో** కల్తీకల్లు దందా యథేచ్ఛగా సాగుతున్నది. అధికార పార్టీ నేతల అండదండలు ఉండడం, అధికారుల ఉదాసీన వైఖరితో అక్రమార్కులు రెచ్చిపోతున్నారు. ఎక్సైజ్ శాఖ నిర్లిప్తత మూలంగా కల్తీ కల్లు బాధితులు మానసిక చికిత్స కేంద్రాలకు వరుస కట్టాల్సిన దుస్థితి దాపురించింది. సాధారణ జీవితాన్ని తిరిగి పొందేందుకు వీలుకాక పోగా ప్రాణాలే పోగొట్టుకుంటున్నారు. తద్వారా బాధిత కుటుంబాలు రోడ్డుపడుతున్నాయి. కల్తీ కల్లు సమస్య రోజురోజుకూ తీవ్రమవుతున్నా ప్రజాపాలనలో పట్టించుకునే నాథుడు కరువయ్యాడు.

**అనుమతికి మించి కల్లు కాంపౌండ్లు**

కొందరు మాఫియాగా ఏర్పడి కల్తీ కల్లును తయారుచేస్తున్నారు. ఎక్సైజ్ శాఖ అధికారులను మామూళ్ల మత్తులో ముంచుతూ ..తమ కల్తీ దందాను యథేచ్ఛగా సాగిస్తున్నారు. కల్లులో కలిపే నిషేధిత క్లోరో హైడ్రేట్(సీహెచ్), అల్ప్రాజోలం పదార్థాలు నేరుగా కల్లు కాంపౌండ్లకే తరలిస్తున్నారంటే పరిస్థితి ఎంత దారుణంగా తయారైందో అర్థం చేసుకోవచ్చు. మద్యానికి బానిసైన వారు కల్లు కాంపౌండ్ల వద్ద బారులు తీరుతున్నారు. నిజామాబాద్ జిల్లాలో ఎక్కడ కూడా తాటి, ఈత చెట్లు అంతగా లేవు. కాగితాలపై కాకి లెక్కలు తప్ప, క్షేత్ర స్థాయిలో ఉత్పత్తికి సరిపడా చెట్లు అందుబాటులో లేవు. తాటి, ఈత చెట్లు లేకున్నా డ్రమ్ముల కొద్దీ కల్లు కాంపౌండ్లలో దర్శనమిస్తున్నది. ఇందులో సీహెచ్ కలుపుతుండడంతో.. దానిని తాగినవారు అనారోగ్యం బారిన పడి ప్రాణాలమీదికి తెచ్చుకుంటున్నారు. అన్ని డిపోల్లోనూ ఎక్కువగా క్లోరో హైడ్రేట్ పదార్థాన్ని వినియోగిస్తున్నారు. నిజామాబాద్ జిల్లాలో వందలాది కల్లు డిపోలకు ఎక్సైజ్ శాఖ లైసెన్సులు మంజూరు చేసింది. ఇందులో సగం మంది లైసెన్సుదారులు కల్లును అమ్ముకోవచ్చు. కానీ అనుమతి ఉన్న కల్లు డిపోలకు పదిరెట్ల కాంపౌండ్లు నడుస్తున్నాయి. ప్రతి నెలా ఎక్సైజ్ శాఖకు మామూళ్లు వెళ్తుండడంతో కల్తీ కల్లు విక్రయిస్తున్నా అధికారులు చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

**పొరుగు రాష్ట్రాల నుంచి తరలింపు**

గడిచిన ఏడాదిన్నర కాలంలో ఇప్పటి వరకు నామమాత్రంగానే 34(ఏ), 37(ఎ) కేసులు నమోదు చేశారు. కల్తీ కల్లు వ్యవహారంలో ఈ మధ్య కాలంలో కాంగ్రెస్ పార్టీకి చెందిన కీలక నేతలు సైతం భాగస్వామ్యమైనట్లు తెలిసింది. ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు స్వయంగా కల్తీ కల్లును అరికట్టాలని ఆదేశించినా, అధికారుల తీరులో మార్పు రాలేదు. కాంపౌండ్‌లో యథేచ్ఛగా కల్తీ కల్లు ఏరులై పారుతున్నది. పొరుగున ఉన్న కర్ణాటక, మహారాష్ట్ర నుంచి భారీగా అల్ప్రాజోలం తరలిస్తున్నట్లు సమాచారం. వీటి రవాణాకు అక్రమార్కులు రోజుకో తీరులో మార్గాలను అన్వేషిస్తుండగా.. ఆబ్కారీ శాఖ మాత్రం వాటిని ఛేదించడంలో విఫలమవుతున్నది.

**నిద్ర మత్తులో ఎక్సైజ్ శాఖ**

ఉమ్మడి జిల్లాలో కల్తీ కల్లు యథేచ్ఛగా తయారుచేస్తున్నా ఆబ్కారీ శాఖ మాత్రం మొద్దు నిద్రను వీడడంలేదు. మామూళ్ల మత్తులో జోగుతుండడంతో డిపోల్లో కల్తీ కల్లు తయారీపై నిఘా పెట్టడం లేదని ఆరోపణలు వినిపిస్తున్నాయి. ప్రస్తుతం గ్రాము క్లోరో హైడ్రేట్(సీహెచ్) రూ.700 నుంచి రూ.వెయ్యి వరకు ధర పలుకుతున్నది. జిల్లా కేంద్రాలతో పాటు ముఖ్య పట్టణాల్లో దళారుల ద్వారా సీహెచ్‌ను కల్లు కాంపౌండ్లకు తరలిస్తున్నారు. ముఖ్యంగా రాత్రిళ్లు, తెల్లవారుజామున కాంపౌండ్ నిర్వాహకులకు పంపిణీ చేస్తున్నారు. జిల్లాకు ఒకరు చొప్పున సీహెచ్ సరఫరా చేసే బాధ్యతను తీసుకున్నట్లు సమాచారం. వీరికి కీలక నేతలు సహకారం అందిస్తున్నట్లు తెలిసింది. కల్లు డిపోలను నిర్వహించే బడా వ్యక్తుల ఇండ్లలోనే క్లోరో హైడ్రేట్‌ను రహస్యంగా నిల్వ ఉంచుతున్నట్లు సమాచారం. తెల్లవారుజామునే కల్లు డిపోలో పని చేసే కార్మికుల ద్వారా గుట్టు చప్పుడు కాకుండా తరలిస్తున్నట్లు సమాచారం. ఎక్సైజ్ శాఖ నిరంతర తనిఖీలు, పర్యవేక్షణ లేకపోవడంతో సీహెచ్ విచ్చలవిడిగా రాజ్యమేలుతున్నది. తయారీదారులకు అధికార పార్టీతో సత్సంబంధాలు ఉండడంతో వారిని మచ్చిక చేసుకుని స్నేహ సంబంధాలను నెరుపుతూ పలువురు వృత్తికే కళంకం తీసుకువస్తున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. కల్లు డిపోల్లో ఆకస్మిక తనిఖీలు నిర్వహిస్తే నూటికి నూరు శాతం కల్తీ కల్లు దందా తేటతెల్లం అవుతుందని ప్రజలు అభిప్రాయపడుతున్నారు. ఎప్పుడో ఒకప్పుడు సీహెచ్ తరలిస్తున్న మధ్యవర్తులను, దళారులను పట్టుకుని కేసులు నమోదు చేస్తున్నారు. కానీ దాని వెనుక దాగి ఉన్న అక్రమార్కుల చిట్టాను శోధించడంలో ఆబ్కారీ శాఖ వెనుకబడుతున్నదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.






టీయూలో రాష్ట్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న ఏబీవీపీ నాయకులు

## హెచ్‌సీయూ భూముల వేలం ఆపాలి

- అరెస్టు చేసిన విద్యార్థి సంఘాల నాయకులను వెంటనే విడుదల చేయాలి
- ఎస్ఎఫ్ఐ నాయకుల డిమాండ్
- జిల్లా కేంద్రంతోపాటు టీయూలో ప్రభుత్వ దిష్టిబొమ్మ దహనం

ఖలీల్‌వాడి/ డిచ్‌పల్లి (ఇందల్వాయి), ఏప్రిల్ 1 : హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీకి సంబంధించిన 400 ఎకరాల భూములను రాష్ట్ర ప్రభుత్వం వేలం వేయడం నిలిపివేయాలని విద్యార్థి సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. భూముల వేలం ఆపాలని డిమాండ్ చేస్తూ ఆందోళన చేసిన విద్యార్థి సంఘాల నాయకులను అరెస్టు చేయడాన్ని తీవ్రంగా ఖండించారు. వారిని విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు జిల్లా కేంద్రంలో ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో, తెలంగాణ యూనివర్సిటీలో ఏబీవీపీ ఆధ్వర్యంలో రాష్ట్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేసి నిరసన తెలిపారు. జిల్లా కేంద్రంలో ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి రాచకొండ విఘ్నేశ్ మాట్లాడుతూ వన్యప్రాణులను కాపాడాల్సిన ప్రభుత్వమే బుల్డోజర్లతో జంతువులను హింసించడం సరికాదన్నారు. పూర్వ విద్యార్థులైన డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, ఐటీ మంత్రి శ్రీధర్‌బాబు హెచ్‌సీయూ భూముల వేలంపై సీఎం రేవంత్ రెడ్డిని ప్రశ్నించకపోతే వెంటనే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం బుల్డోజర్లను వెనక్కి పంపించి, 400 ఎకరాలను తిరిగి హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీకి అప్పగించాలని, లేకపోతే ఆందోళన కార్యక్రమాలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు దినేశ్, నగర అధ్యక్షుడు ఆజాద్, నాయకులు రాజు, కిరణ్, రాహుల్, అభి, మనీశ్ పాల్గొన్నారు.

**హెచ్‌సీయూ భూముల విషయంలో ప్రభుత్వం వెనక్కి తగ్గాలి**

హెచ్‌సీయూ భూముల వేలాన్ని ఆపివేయాలని, వెంటనే ఆ భూములను యూనివర్సిటీ యాజమాన్యానికి అప్పగించాలని డిమాండ్ చేస్తూ టీయూ ఏబీవీపీ ఆధ్వర్యంలో వర్సిటీ సెంట్రల్ లైబ్రరీ వద్ద నిరసన తెలుపుతూ ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా ఏబీవీపీ జాతీయ కార్యవర్గ సభ్యుడు శివ మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం పేద విద్యార్థులు చదువుకునే యూనివర్సిటీపై కక్ష కట్టిందని, వాటి భూములను కాజేసి తన అనుయాయులకు అప్పగించి రియల్ ఎస్టేట్ వ్యాపారం చేయాలని చూస్తున్నదని మండిపడ్డారు. ఒక రియల్‌ఎస్టేట్ బ్రోకర్ సీఎం అయితే ఏ విధంగా ఉంటుందో తన చర్యల ద్వారా రేవంత్ రెడ్డి చూపిస్తున్నాడని మండిపడ్డారు. వర్సిటీ భూములను ప్రభుత్వం వేలం వేయాలనే నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని, శాంతియుతంగా నిరసన వ్యక్తం చేస్తున్న విద్యార్థులపై పోలీసులు అత్యుత్సాహంతో లాఠీచార్జి చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నట్లు తెలిపారు. హెచ్‌సీయూ భూముల వేలం నిర్ణయాన్ని వెనక్కి తీసుకోకపోతే రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో యూనివర్సిటీ ఉపాధ్యక్షులు తరుణ్, సమీర్, అజయ్, నాయకులు అశోక్, రాము, పృథ్వీ, అనిల్, నరేందర్, శివ, అశ్విత్, హరినాథ్‌రెడ్డి పాల్గొన్నారు.

## విద్యార్థి సంఘ నాయకుల ముందస్తు అరెస్టు

కామారెడ్డి, ఏప్రిల్ 1: హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ భూముల వేలం నిలిపివేయాలని కోరుతూ హైదరాబాద్‌కు తరలివెళ్లడానికి సిద్ధమవుతున్న విద్యార్థి సంఘాల నాయకులను పోలీసులు ముందస్తు అరెస్టు చేశారు. కామారెడ్డిలో మంగళవారం తెల్లవారు జమున ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి అరుణ్‌తో పాటు విద్యార్థి సంఘ నాయకులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. పోలీసుల అక్రమ అరెస్టుపై విద్యార్థి సంఘాల నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు.



కామారెడ్డిలో విద్యార్థి సంఘ నాయకులను అరెస్టు చేసిన పోలీసులు

# ‘భగీరథ’పై అంతులేని నిర్లక్ష్యం!




వేతనాల కోసం మిషన్‌భగీరథ ప్లాంట్ వద్ద ధర్నా చేస్తున్న కాంట్రాక్ట్ కార్మికులు (ఫైల్)

**ఆపరేటర్లు, లైన్‌మెన్లకు ఆరునెలలుగా అందని జీతాలు**

‘మిషన్ భగీరథ’లో కాంట్రాక్ట్‌పై పనిచేస్తున్న ఆపరేటర్లు, లైన్‌మెన్లకు ఆరు నెలలుగా వేతనాలు అందడంలేదు. దీంతో వారు గత నెల10న మిషన్‌భగీరథ ఎత్తిపోతల వద్ద ధర్నా నిర్వహించారు. దాదాపు 40 మంది ఆందోళన చేపట్టి, తమకు రావాల్సిన వేతనాలను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ నేపథ్యంలో ఎక్కడికైనా వెళ్లి పనులు చేయాల్సి వస్తే గతంలోమాదిరిగా పనులు త్వరంగా జరగడంలేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

- ప్లాంట్ నిర్వహణ అస్తవ్యస్తం
- పైప్‌లైన్లకు మరమ్మతులు కరువు
- నీళ్లు రాక గ్రామాల్లో ఇబ్బందులు
- పట్టించుకోని అధికారులు

మోర్తాడ్, ఏప్రిల్1 : ఇంటింటికీ శుద్ధ జలాలు అందించాలనే ఉద్దేశంతో కేసీఆర్ ప్రభుత్వం మిషన్ భగీరథ పథకాన్ని ప్రారంభించింది. ఇప్పటికీ గ్రామాలకు భగీరథ నీళ్లు సరఫరా చేస్తున్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడడంతో మిషన్ భగీరథ నిర్వహణపై నిర్లక్ష్యం నెలకొన్నది. దీంతో చాలా గ్రామాల్లో నీళ్లు రాని పరిస్థితి ఏర్పడింది. కొన్ని గ్రామాల్లో కలుషిత నీరు రావడం, రంగుమారడం పరిపాటిగా మారింది. మరి కొన్ని గ్రామాల్లో పురుగులు ఉన్న నీళ్లు వస్తున్నాయి. దీంతో ప్రజలు ఆందోళనకు గురవుతున్నారు. వేసవి కాలం రావడంతో తాగునీటి కోసం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

**మండలాల వారీగా వ్యయం**

మిషన్‌భగీరథ ఏర్పాటుకు ప్లాంట్ నుంచి ఇంటికి వచ్చే నల్లా కనెక్షన్ వరకు చేపట్టిన పనులకు ప్రతి మండలానికి రూ. కోట్లు ఖర్చుచేశారు. ముప్కాల్ మండలానికి రూ.21.89 కోట్లు, మెండోరా రూ.32.69 కోట్లు, మోర్తాడ్ రూ.39.15కోట్లు, ఏర్గట్ల రూ.20.87కోట్లు, కమ్మర్‌పల్లి రూ.42.79కోట్లు, భీమ్‌గల్ రూ.78.58కోట్లు, వేల్పూర్ రూ.57.20కోట్లు, బాల్కొండ మండలంలో రూ.35.58 కోట్ల ఖర్చుతో మిషన్‌భగీరథ పనులను పూర్తి చేశారు. జలాల్‌పూర్ ఎత్తిపోతల నుంచి పైప్‌లైన్ పనులు, ట్యాంకుల నిర్మాణం, గ్రామాల్లో పైప్‌లైన్ల ఏర్పాట్లు, ఇంటింటికీ కుళాయి కనెక్షన్ల వరకు పనులు పూర్తిచేసి విజయవంతంగా ఫిల్టర్ నీళ్లను అందించారు. ప్రస్తుతం అధికారుల నిర్లక్ష్యం కారణంగా నీళ్లు రాని పరిస్థితులు ఏర్పడుతున్నాయి.

**మరమ్మతుల్లో నిర్లక్ష్యం**

కొంతకాలంగా చాలా చోట్ల పైప్‌లైన్లు లీకేజీలు ఏర్పడినా పట్టించుకోవడంలేదు. ముప్కాల్‌లో పైప్‌లైన్ లీకేజీ కారణంగా జాతీయరహదారిపైకి మిషన్‌భగీరథ నీళ్లు వస్తున్నా పట్టించుకునే నాథుడే కరువయ్యాడు. లీకేజీల కారణంగా కలుషిత నీరు వస్తున్నదని గ్రామస్తులు వాపోతున్నారు. కమ్మర్‌పల్లి మండలంలో మిషన్ భగీరథ నిర్వహణ అధ్వానంగా మారింది. ఎప్పుడు నీళ్లు సరఫరా చేస్తారో తెలియని పరిస్థితి. ఒకవేళ నీళ్లు ఇచ్చినా ఒకటి రెండు బిందెల కన్నా ఎక్కువ నిండడంలేదు, అవికూడా మట్టి రంగుతో వస్తున్నాయి. అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఇప్పటి వరకు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం గమనార్హం. అమీర్‌నగర్ గ్రామంలో కూడా ఇదే పరిస్థితి నెలకొన్నది. మండలంలో మిషన్ భగీరథ నీళ్లు రాని ఇండ్లు కూడా చాలానే ఉన్నాయి. భీమ్‌గల్ మండలం బడాభీమ్‌గల్ శివారులోని పంటపొలాల్లో మిషన్‌భగీరథ పైప్‌లైన్ ధ్వంసమై నీరు వృథాగా పోతున్నా ఎవరూ పట్టించుకోవడం లేదు. వేసవికాలం ప్రారంభం కావడంతో తాగనీటి సమస్య తీవ్రరూపం దాల్చే అవకాశాలు కనిపిస్తున్నా అధికారులు స్పందించడంలేదు. గ్రామాల్లో మరమ్మతు పనులను పంచాయతీలకు జనవరి 24 నుంచి ప్రభుత్వం అప్పగించింది. ప్రస్తుతం పంచాయతీల్లో నిధులు లేక పనులు ముందుకుసాగడంలేదు. ఈనేపథ్యంలో గ్రామాల్లో మిషన్‌భగీరథకు సంబంధించి మరమ్మతులు చేయాల్సి వస్తే, పరిస్థితి ఏమిటనే ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి.



ముప్కాల్‌లో పైప్‌లైన్ పగిలి జాతీయరహదారిపై లీకవుతున్న మిషన్‌భగీరథ నీరు

## ఆన్‌లైన్ బెట్టింగ్‌కు యువకుడి బలి

- రూ.3 లక్షలు నష్టపోయిన వైనం




ఆకాశ్ (ఫైల్)

వినాయక్‌నగర్, ఏప్రిల్1: ఆన్‌లైన్ బెట్టింగ్ ఒకరి ప్రాణం తీసింది. ఆన్‌లైన్ బెట్టింగ్‌లో తీవ్రంగా నష్టపోయిన ఓ యువకుడు పురుగుల మందుతాగి ఆత్మహత్యకు యత్నించగా.. చికిత్స పొందుతూ మృతిచెందాడు. ఈ ఘటన నిజామాబాద్ రూరల్ మండలం ఆకుల కొండూర్‌లో చోటుచేసుకున్నది. యువకుడి బంధువులు, పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. నిజామాబాద్ రూరల్ మండల పరిధిలోని ఆకుల కొండూర్ గ్రామానికి చెందిన లక్ష్మి, గంగారాం దంపతుల కుమారుడు ఆకాశ్ (25) ఓ ప్రైవేట్ సంస్థలో పనిచేస్తుండేవాడు. సదరు యువకుడు మూడు, నాలుగేండ్ల నుంచి ఆన్‌లైన్ బెట్టింగ్‌కు అలవాటుపడ్డాడు. తరచూ బెట్టింగ్ యాప్‌లో డబ్బులు పెట్టి సుమారు రూ. 3 లక్షల వరకు నష్టపోయాడు. తాజాగా మార్చి 27న సైతం బెట్టింగ్ యాప్‌లో మరో రూ.25 వేలు నష్టపోవడంతో తీవ్ర మనస్తాపం చెందిన ఆకాశ్ అదే రోజు పురుగుల మందు తాగాడు. గమనించిన కుటుంబీకులు వెంటనే జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేటు దవాఖానకు తరలించారు. చికిత్స పొందుతూ మంగళవారం మృతిచెందడంతో తల్లిదండ్రులు కన్నీరు మున్నీరుగా విలపించారు. ఆకాశ్‌కు భార్య పద్మ, ఐదు నెలల బాబు ఉన్నాడు. మృతదేహాన్ని ప్రైవేట్ దవాఖాన నుంచి ప్రభుత్వ దవాఖానకు తరలించినట్లు రూరల్ ఎస్సై మహ్మద్ ఆరీఫ్ తెలిపారు.

## బ్రాహ్మణ సంక్షేమానికి కృషి

బీఆర్ఎస్ ఎమ్మెల్సీ సురభి వాణీదేవి



బోర్గాం చౌరస్తాలో పీవీ నర్సింహారావు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్సీ సురభి వాణీదేవి, రూరల్ మాజీ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్

సుభాష్‌నగర్/ సారంగాపూర్, ఏప్రిల్ 1: బ్రాహ్మణుల సంక్షేమానికి బీఆర్ఎస్ ప్రభుత్వం ఎంతో కృషి చేసిందని ఎమ్మెల్సీ సురభి వాణీదేవి అన్నారు. బ్రాహ్మణ విద్యార్థుల ఉన్నత చదువులకు విదేశాల్లో ఉన్నత విద్య కోసం ఆర్థిక సహాయం చేసిందని తెలిపారు. మంగళవారం ఆమె బాసర అమ్మవారిని దర్శించుకున్న అనంతరం తిరుగు ప్రయాణంలో నిజామాబాద్ జిల్లా కేంద్రంలో రూరల్ మాజీ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్ నివాసానికి వెళ్లారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీకి బాజిరెడ్డి దంపతులు, కుటుంబీకులు స్వాగతం పలికి సత్కరించారు.

అనంతరం బాజిరెడ్డితో కలిసి బోర్గాం(పీ) చౌరస్తా వద్దకు చేరుకొని, అక్కడ మాజీ ప్రధాని పీవీ నర్సింహారావు విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ సురభి వాణీదేవితోపాటు బాజిరెడ్డి మాట్లాడుతూ.. ప్రధాని హోదాలో దేశానికి సేవలు అందించిన తెలంగాణవాసి పీవీని కాంగ్రెస్ పార్టీ అధినేతలు నాడు గుర్తించలేకపోయారని అన్నారు. దేశం ఆర్థిక సంక్షోభం ఎదుర్కొంటున్న పరిస్థితిలో నూతన ఆర్థిక సంస్కరణలు తీసుకొచ్చి అందరి మెప్పు పొందారన్నారు. బహుభాషా కోవిదుడుగా పేరుగాంచిన పీవీ ప్రధాని హోదాలో ఎన్నో సేవలందించి తెలంగాణ ఘనతను చాటినందుకు గాను బీఆర్ఎస్ పాలనలో సీఎం కేసీఆర్ హైదరాబాద్‌లో ఆయన విగ్రహాన్ని ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. నగర శివారు బోర్గాం(పీ) చౌరస్తాలో కూడా పీవీ విగ్రహాన్ని తామంతా కలిసి ఏర్పాటు చేశామని బాజిరెడ్డి గోవర్ధన్ తెలిపారు. కార్యక్రమంలో జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ అధ్యక్షుడు ఈగ సంజీవ్‌రెడ్డి, జాగృతి రాష్ట్ర కార్యదర్శి లక్ష్మీనారాయణ భరద్వాజ్ , బ్రాహ్మణ సంఘం సభ్యులు మదన్ దీక్షితులు, రమేశ్ కులకర్ణి, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.




## వైకుంఠధామానికి దారేది?

**పల్లెల్లో ప్రగతి కుంటుపడింది.** పారిశుద్ధ్యం లోపించింది. పల్లెప్రకృతి వనాలు, వైకుంఠధామాలు కళావిహీనంగా మారాయి. మోపాల్ మండలం కాస్బాగ్ తండాలో వైకుంఠ ధామంలోనికి వెళ్లే మార్గం మొత్తం పిచ్చిమొక్కలతో నిండిపోయింది. లోపలికి వెళ్లే దారి లేకుండా పోయినా అధికారులు పట్టనట్టు వ్యవహరిస్తున్నారని గ్రామస్తులు చెబుతున్నారు.

– స్టాఫ్ ఫొటోగ్రాఫర్, నిజామాబాద్